
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 1 జూలై 2024



2న ఇసుక డంపుల వేలం

నంగునూరు, జూన్ 30: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను జూలై 2న వేలం వేయనున్నట్లు నంగునూరు తహసీల్దార్ సరిత తెలిపారు. ఇటీవల రాజగోపాలపేట పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుకను వేలం వేయనన్నట్లు తెలిపారు. ఒక క్యూబిక్ మీటర్ ఇసుక ధర రూ.615 అని, వేలంలో ఎక్కువ పాట పాడిన వారు పాటలో 50శాతం చెల్లించాలన్నారు. మిగతావి ఇసుక తరలించి అనుమతి పొందే ముందు చెల్లించాలని సూచించారు.

ప్రమాదపు వల

- కోమటిచెరువులో అనుమతులు లేకుండా వలలు వేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు
- ఇటీవలే వలకు చిక్కుకుని ఆగిన బోటు
- తాళ్ల సహాయంతో ఒడ్డుకు లాగి పర్యాటకులను రక్షించిన అధికారులు



సిద్ది పేట పట్టణంలోని కోమటిచెరువులో చేపల కోసం వేసిన వల



సిద్దిపేటటౌన్, జూన్ 30 : మత్స్యకారుల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తుంటే కొందరి దురాలోచన వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారు. అనుమతులు లేకుండా రాత్రిళ్లు వలలు వేస్తూ చేపల్ని పడుతున్నారు. వాటిని అధిక ధరలకు బయట విక్రయిస్తూ మత్స్యకారుల బతుకుదెరువుకు గండికొడుతున్నారు. కోమటిచెరువులోనూ కొందరు వలలు వేస్తూ పర్యాటకుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.

సిద్దిపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత క్రమక్రమంగా అభివృద్ధి చెంది.. రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. పర్యాటకంగా అభివృద్ధి చెందిన కోమటిచెరువును చూసేందుకు సిద్దిపేట జిల్లాతో పాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారి ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసేందుకు చెరువులో బోటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే మత్సకారులు ఆర్థికాభివృద్ధి చెందాలని, వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ హయాంలో కోమటిచెరువులో చేపపిల్లలను వదిలారు. అవి పెరిగి పెద్దయ్యాక మత్స్యకారులు వలలు వేసినపుడు బోటింగ్‌కు అటువైపు అనుమతించారు. అయితే, కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రిళ్లు వచ్చి చేపలు పట్టేందుకు ఇష్టారీతిన వలలు వేస్తున్నారు. ఈ విషయం తెలియక పర్యాటకుల బోట్లు వలలో చిక్కుకుని ఆగిపోతున్నాయి. ఇటీవల ఇలాంటి సంఘటనే చోటుచేసుకోగా అధికారులు పర్యాటకులను తాళ్ల సహాయంతో రక్షించారు.

వీకెండ్‌లో పర్యాటకుల రద్దీ..

కోమటిచెరువుపై పర్యాటకులకు బోటుసౌకర్యం, సస్పెన్షన్ బ్రిడ్జి, నెక్లెస్ రోడ్డు, నైట్‌గార్డెన్, మ్యూజికల్ పౌంటెన్, చిన్నారులు ఆడుకునేలా పలు ఏర్పాట్లు చేశారు. మిగిలిన రోజుల కంటే వీకెండ్‌లో కోమటిచెరువు పర్యాటకులతో కిక్కిరిసిపోతుంది.

ఇటీవల తప్పిన బోటు ప్రమాదం..

పక్షం రోజుల క్రితం కోమటిచెరువుకు వచ్చిన పర్యాటకులు బోటులో షికారు చేస్తుండగా మధ్యలోనే బోటు ఆగిపోయింది. దీంతో పర్యాటకులు ఆందోళనకు గురవడంతో తక్షణమే స్పందించిన పర్యాటక శాఖ అధికారులు బోటుకు తాళ్లను కట్టి దాని సహాయంతో ఒడ్డుకు లాగారు. ఆ బోటులో దాదాపు 15 మందికి పైగా చిన్నారులు, మహిళలు, యువకులు ఉన్నారు. బోటు ఒడ్డుకు చేరే వరకు పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు వేసిన వలలో చిక్కుకుని బోటు ఆగిపోయినట్లు అధికారులు గుర్తించి చర్యలకు పూనుకున్నారు.

నిరంతరం చేపల వేట

కోమటిచెరువులో నిరంతరం గుర్తుతెలియని వ్యక్తులు నిరంతరం చేపలు పడుతున్నారు. కోమటిచెరువుకు సంబంధించిన వాగు ప్రాంతాల్లో కూడా కొందరు అదే పనిగా చేపలను వేటాడుతున్నారు. పర్యాటక అధికారులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండానే ఇష్టానుసారంగా వలలు వేస్తున్నారు. చిక్కిన చేపలను విక్రయిస్తున్నారు. తమ అనుమతి లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో వలలు వేసి, బోటు వాహనాలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పర్యటక శాఖ ఆధ్వర్యంలో అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు.

అనుమతి తీసుకోవాల్సిందే

- గంగారాం, డిప్యూటీ మేనేజర్, పర్యాటకశాఖ సిద్దిపేట



చెరువులో చేపల కోసం వల వేయాలంటే పర్యాటకశాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల బోటు స్వల్ప ప్రమాదానికి గురైన ఘటనలో భాగంగా చెరువు వద్ద సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశాం. చేపల కోసం మత్సకారులు వల వేయాలంటే ముందుగా మా దృష్టికి తీసుకురావాలి. ముందుగా తెలియజేస్తే పర్యాటకులు బోటును అటువైపు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహిస్తాం.



బోటుకు తాళ్లు కట్టి ఒడ్డుకు లాగుతున్న పర్యాటక శాఖ సిబ్బంది (ఫైల్)

సనాతన ధర్మం, సంస్కృతిని కాపాడుతున్న శిశుమందిర్ విద్యాసంస్థలు

- శిశు మందిర్ విద్యార్థిని కావడంతోనే న్యాయం, ధర్మం కోసం కొట్లాడా
- ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

హుస్నాబాద్‌రూరల్, జూన్30: సనాతన ధర్మాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను నేటికీ కాపాడుతున్న సంస్థలంటే కేవలం శిశుమందిర్ విద్యాసంస్థలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లో శిశుమందిర్ నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. కార్పొరేట్ సంస్థలు వచ్చి చిన్నచిన్న విద్యాసంస్థలను చిన్నాభిన్నం చేశాయని తెలిపారు. శిశుమందిర్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమాన్ని బోధిస్తున్నా ఎక్కడా కూడా మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ కల్చర్ ఉండదన్నారు. సంస్కృతీ సాంప్రదాయలకు ఆటంకం కలగలేదన్నారు. శిశు మందిర్ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నత ఉద్యోగాల్లో కొనసాగుతున్నారని, మరికొందరు జాతీయ నాయకులుగా ఎదిగినట్లు పేర్కొన్నారు. తాను శిశుమందిర్ పాఠశాలలో చదువుకున్నానని గర్వంగా చెబుతానని.. ఈ రోజు ఈ స్థాయికి ఎదిగానంటే అందుకు శిశుమందిర్ విద్యాసంస్థనే కారణమన్నారు. తాను ఎంపీగా న్యాయం, ధర్మం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తే లాఠీ దెబ్బలు తినడమే కాకుండా తనపై 109 కేసులు పెట్టినా ఎక్కడా జంకకుండా, భయపడకుండా ఉద్యమించానని బండి సంజయ్ తెలిపారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలు ముడుపులుగా చెల్లించే డబ్బుతో ప్రభుత్వాలు నడిచే పరిస్థితి ఏర్పడిందన్నారు. మదరసా, మిషనరీ సంస్థలు నడిపే స్కూళ్లకు నిధులు, జీతాలు ఇస్తున్న పాలకులు శిశుమందిరాలకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మతం ముద్ర వేసి శిశుమందిర్ సంస్థలకు నిధులు కేటాయించడం లేదన్నారు. శిశుమందిర్ లేకుంటే విద్యావ్యవస్థ కుంటుపడిపోతుందన్నారు. దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయ ఆచారాలు పాటిస్తూ, విద్యాబోధన అందించే శిశుమందిర్ విద్యాసంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బండి సంజయ్ తన ప్రసంగం అనంతరం 1.30 సెకండ్లకు పైగా "ఈ భూమి బిడ్డలందరం...హిందువులం..కష్టసుఖాల్లో కలిసిమెలిసి ఉంటుంటే.. బతుకు బంగారు లోకం..."అంటూ పాటపాడి సభికులను అలరించారు. కేంద్రమంత్రి హోదాలో శిశుమందిర్‌కు వచ్చిన బండి సంజయ్‌కి విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. శాలువాలతో, బొకేలతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యాపీఠం దక్షిణ క్షేత్ర కార్యదర్శి లిగం సుధాకర్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు శ్రీనివాస్, వల్లపు రాజు అశోక్, చిట్టి గోపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న బండి సంజయ్

ఎంపీ అభ్యర్థుల ఖర్చుల వివరాలు పక్కాగా ఉండాలి

సంగారెడ్డి రూరల్, జూన్ 30 : లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఎంపీ అభ్యర్థుల ఖర్చుల వివరాలు పక్కాగా ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ఖర్చుల రికార్డులపై ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు ఎన్నికల వ్యయ ఖర్చుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో పరిశీలనలో జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతిలాల్ పీటీ, అభ్యర్థుల ప్రతినిధులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి

నేటి నుంచి అమలులోకి కొత్త చట్టాలు

- సీపీ అనురాధ



సిద్దిపేట క్రైం, జూన్ 30 : నేటి నుంచి భారత ప్రభుత్వ నూతన నేరన్యాయ చట్టాలు 2023 అమలులోకి రానున్నట్లు సీపీ డాక్టర్ బి.అనురాధ పేర్కొన్నారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం లభిస్తాయని తెలిపారు. నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు సిబ్బందికి నెల రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అమల్లోకి రానున్న కొత్తచట్టాలు మనదేశ అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్త విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వస్తుందని, ప్రజలకి మరింత సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. భారత్ స్వతంత్ర దేశంగా మారిన తర్వాత కూడా వలస పాలన నాటి న్యాయచట్టాల ప్రకారమే నేరన్యాయ వ్యవస్థ, శాంతి భద్రతల పరిరక్షణ వ్యవస్థ నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఇన్నేళ్లలో భారత న్యాయ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, అవసరాన్ని బట్టి ప్రజాభద్రతకు ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం మనదేశ శాంతిభద్రతల పరిరక్షణలో ఒక మైలురాయి అని తెలిపారు. పోలీస్ అధికారులు సిబ్బంది నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పంట రుణమాఫీ అద్భుత పథకం

- సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.451 కోట్లు మాఫీ
- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

7వ

గంజాయి మత్తులో మల్లన్న భక్తులపై దాడి

- పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘటన
- రాడ్, కర్రలతో యువకుల దాష్టీకం
- పలువురికి గాయాలు.. ఏడుగురిపై కేసు : చేర్యాల సీఐ శ్రీను

7

కాలువ పనులను అడ్డుకున్న భూనిర్వాసితులు

- పూర్తి పరిహారం చెల్లించాకే పనులు చేయాలని డిమాండ్

తొగుట, జూన్ 30: తొగుట మండలం బండారుపల్లి గ్రామశివారులో చేపడుతున్న మల్లన్నసాగర్ అదనపు టీఎంసీ కాలువ పనులను ఆదివారం భూనిర్వాసితులు మరోమారు అడ్డుకున్నారు. పూర్తి పరిహారం అందజేసిన తర్వాతనే పనులు చేపట్టాలని భైఠాయించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ అదనపు టీఎంసీ కాలువ నిర్మాణం కోసం బండారుపల్లిలో 90 ఎకరాల భూమిని సేకరించారని, నాడు ఎకరానికి రూ.13 లక్షలు ఇస్తామని అధికారులు హామి ఇచ్చారని తెలిపారు. మొదటి విడతగా రూ.8లక్షల ఇచ్చారని, మిగిలిన రూ.5లక్షలు ఇవ్వకుండా మూడేళ్ల నుంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై 20 రోజుల క్రితం అదనపు టీఎంసీ కాలువ పనులను అడ్డుకున్నామని అప్పుడు అధికారులు వచ్చి 15 రోజుల్లో పరిహారం డబ్బు ఇస్తామని చెప్పి ఇంతవరకు పట్టించు కోవడం లేదని మండిపడ్డారు. తమకు పూర్తి పరిహారం ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. విషయం తెలుసుకుని సంబంధిత కాలువ పనులు చేపడుతున్న కేఎస్ఆర్ కంపెనీ కాంట్రాక్టర్ ప్రతినిధులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు అక్కడి నుండి కదలక పోవడంతో 16 లోపు ప్రభుత్వం డబ్బు ఇవ్వకపోతే భూ నిర్వాసితులకు చెల్లించాల్సిన మొత్తాన్ని తామే చెల్లిస్తామని అప్పటి వరకు పనులను అడ్డుకోవద్దని లిఖిత పూర్వకంగా వారికి రాసిచ్చారు. తాము ఆ రోజున డబ్బులు ఇవ్వకపోతే పనులను అడ్డుకోవచ్చని, తాము అడ్డుచెప్పబోమని కంపెనీ సిబ్బంది తెలిపారు. వారి హామీ మేరకు నిర్వాసితులు ఆందోళన విరమించారు. ఆందోళన చేపట్టిన వారిలో దుర్గయ్య, పరమేశ్వర్, బాల్‌రాజ్, నారాయణ, బాలమణి, ఎల్లయ్య, దేవయ్య, సత్తయ్య పోషవ్వ, మల్లవ్వ, భాస్కర్, విజయ, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులను అడ్డుకుని ఆందోళన చేస్తున్న బండారుపల్లి భూనిర్వాసితులు

నిధుల సాధనలో విఫలమైన బీఆర్ఎస్

- మల్లన్న ఆలయాభివృద్ధికి ఎంపీ కోటా నిధులు కేటాయిస్తా
- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చేర్యాల, జూన్ 30 : పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు గాలికి వదిలేసిందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వెనుకబాటుకు గురైందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకం చేసి, పట్నం రచించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలతతో వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల సాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. భువనగిరి నియోజకవర్గం పరిధిలో 16 మునిసిపాలిటీల అభివృద్ధికి, అర్బన్ డెవలప్‌మెంట్ నిధుల మంజూరుకు పాటుపడతానన్నారు. భువనగిరి ఏయిమ్స్ ఆస్పత్రిని డిసెంబరులోగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు స్థానికులకు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయాభివృద్ధికి ఎంపీ కోటా నిధులు కేటాయింపజేసి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర రైల్వేశాఖతో సంప్రదించి మల్లన్న రైల్వేస్టేషన్‌ను పనులను త్వరితగతిన పూర్తిచేయించడంతో పాటు భువనగిరి, ఆలేరు, జనగామ తదితర రైల్వేసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం చేర్యాలలోని కొమ్మూరి నివాసానికి చేరుకుని కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడారు. తొలిసారి పర్యటించడం పట్ల పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి.

హరీశ్‌రావు రాజీనామా చేయాలి : కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

రైతాంగానికి రూ.2లక్షల పంటరుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని, ఈవిషయమై మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ప్రకటన మేరకు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. మల్లన్న ఆలయంలో యేళ్ల తరబడి తిష్టవేసి ప్రతిష్టకు భంగం కలిగించినవారిని ఉపేక్షించబోమని, కొన్ని దుష్టశక్తుల ప్రభావం ఇంకా వెంటాడుతున్నప్పటికీ చిత్తశుద్ధితో సరిచేస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండలాధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్, కొమ్మురవి, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు నాయకులు లింగంపల్లి శ్రీను, లింగంపల్లి కనకరాజు, కాటం మల్లేశం, జంగని రవి, మంచాల చిరంజీవులు, ఆది శ్రీనివాస్, చెరుకు రమణారెడ్డి, సనాది భాస్కర్, మారెల్ల భాస్కర్‌రెడ్డి, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, గూడెపు మహేశ్, ఉడుత రవియాదవ్, వేముల్ల సత్య నారాయణ, ఎర్రమల్ల సుధాకర్, దాసరి శ్రీకాంత్, అరుట్ల వినీత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

ఆరోగ్య మంత్రి ఇలాకాలో ఆలస్యమేలా?

సంగారెడ్డి అర్బన్, జూన్ 30 : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి చేపట్టిన నియామకాల్లో తీవ్ర జాప్యం నెలకొంటున్నది. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, ఆస్పత్రులతో పాటు వివిధ విభాగాల్లో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద 97 పోస్టులకు గత ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. మార్చి 18 వరకు దరఖాస్తులను స్వీకరించారు. అయితే, ఎంపీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నియామక ప్రక్రియ నిలిచింది. ఈ క్రమంలో వచ్చిన దరఖాస్తుల ఫైల్ పక్కన పెట్టగా, ఈ మధ్యనే కోడ్ ముగిసిన నేపథ్యంలో వచ్చిన దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేసినప్పటికీ అయితే ఇంకా ప్రొవిజనల్ మెరిట్ జాబితా వెలువరించకపోవడంపై దరఖాస్తుదారులు పలు అనుమానాలు వ్యక్తంచేయడంతో పాటు ఆందోళన చెందుతున్నారు.

అస్పష్టంగా నోటిఫికేషన్

జిల్లావ్యాప్తంగా వివిధ పోస్టుల భర్తీకి చేపట్టిన నియామకాల నోటిఫికేషన్‌లో పూర్తిస్థాయిలో స్పష్టత లేదు. పనిచేసే ప్రాంతం, వేతనం, రోస్టర్ కూడా నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. అంతే కాకుండా గత మార్చిలో దరఖాస్తుల స్వీకరణకు మూడు రోజుల గడువు మాత్రమే ఇచ్చారు. ఆ క్రమంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న విషయం కూడా లెక్కించలేదంటూ ఆ శాఖ అధికారులు గోప్యంగా ఉంచారు. దీనిపై 'షెడ్యూల్ ఉన్నా.. వెలువడని ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించడంతో సుమారు 3,500కు పైగా దరఖాస్తులు వచ్చాయంటూ ఆ శాఖ అధికారులు ఓ నోట్‌ను విడుదల చేశారు. అంతే తప్ప స్పష్టమైన సంఖ్యను పేర్కొనలేదు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో 22 మందితో కూడిన బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ల ప్రొవిజనల్ లిస్ట్‌తో పాటు తొమ్మిది మందితో కూడిన ఎంఎల్‌హెచ్‌పీల ప్రొవిజనల్ జాబితా కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఆ తరువాత ఉలుకుపలుకు లేదు. ఎన్నికల కోడ్ ముగిసి మూడు వారాలవుతున్నా నియామక ప్రక్రియలో కదలిక లేకపోవడంతో అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి ఇలాకాలో జాప్యం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నియామకాల భర్తీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో జోరుగా పైరవీలు నడుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమవారిని నియమించాలని అధికారులకు సిఫారసులు వస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలులో భాగంగా వివిధ విభాగాల్లో పోస్టులు ఖాళీలు ఏర్పడడంతో వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయి. స్వయాన వైద్య ఆరోగ్య శాఖ ఇలాకాలో ఎన్‌హెచ్‌ఎం పోస్టుల భర్తీలో జాప్యం జరగడమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రి, కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి నియామకాలు వేగవంతం చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

కాలుష్య భూతంపై పోరుబాట

● పరిశ్రమల జల, వాయు కాలుష్యంపై ఆందోళనలు, ఫిర్యాదులు
● కాజీపల్లిలో కాలుష్య బాధితులతో సమావేశాలు
● జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చైతన్య, పోరాట కార్యక్రమాలు

జిన్నారం, జూన్ 30 : పరిశ్రమల చర్యలతో నేటికి కాలుష్య భూతం వెంటాడుతుందని.. ఇక ప్రజా, న్యాయ పోరాటంతోనే సమస్యని నివారించాలని కాజీపల్లి వాసులు పోరుబాట పట్టారు. ప్రతీ ఒక్కరిని పోరాటంలో భాగం చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి, ఇటీవల వరుసగా పీసీబీ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. న్యాయ స్థానాల్లోనూ పోరాటం కోసం సంఘటితం అవుతున్నారు.

దశాబ్దాలుగా మండలంలో కాలుష్య సమస్య

ఉమ్మడి జిన్నారం మండలంలోని పారిశ్రామిక వాడలు సమీప గ్రామాల్లో మూడు దశాబ్దాలుగా కాలుష్య సమస్య ఉన్నది. జల, వాయు కాలుష్యంతో ఈ ప్రాంతాల ప్రజలు నిత్యం సావాసం చేస్తూనే ఉన్నారు. కాలుష్య రక్కసిపై తరచూ స్థానికులు మెదలుకుని రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజా సంఘాల వరకు ఎన్నో పర్యాయాలు పోరాటాలు, కేసులు దాఖలు చేశారు. అయినా కాలుష్య సమస్య వెంటాడుతునే ఉన్నది. ముఖ్యంగా ఉమ్మడి జిన్నారం మండలంలోని బొంతపల్లి, దోమడుగు, మంభాపూర్, అన్నారు. గడ్డపోతారం, కాజీపల్లి. బొల్లారం ప్రాంతాలలో 450 వరకు పరిశ్రమలు ఉంటే అందులో 80



పీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద జేఏసీ ఆందోళన(ఫైల్)


కాజీపల్లి గ్రామ శివారులో కాలువలో పారుతున్న కాలుష్య జలాలు

శాతం వరకు రసాయన పరిశ్రమలే ఉన్నాయి. వీటిలో కొన్ని ఏ మాత్రం కాలుష్య నియంత్రణ చర్యలు పాటించక పోవటంతో తరచూ ఆయా ప్రాంతాలు కాలుష్యమయంగా మారుతున్నాయి. చెరువు, కుంటలు కాలుష్య జలాలతో నిండగా, బహిరంగ ప్రాంతాల్లోనూ పారబోతలు జరుగుతున్నాయి. గతంలో పలు స్వచ్ఛంద సంస్థలు జరిపిన అధ్యాయనాలలో ప్రపంచలో నిషేధించిన రసాయన ఉత్పాదనలు జరిపే వాటిలో 20 వరకు ఇక్కడే తయారీ జరుగుతున్నట్లు గుర్తించటం ఈ ప్రాంతంలో కాలుష్య సమస్యకు నిదర్శనం.

కాలుష్యంపై ఐక్య పోరు

కాజీపల్లి కేంద్రంగా గడ్డపోతారం, కిష్టయ్యపల్లి, గండిగూడడెం గ్రామాలకు చెందిన స్థానికులకు జేఏసీ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. కాజీపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది రమాకాంత్ ఆధ్వర్యంలో ఇటీవల పార్టీలకు అతీతంగా కాలుష్య సమస్యపై సమావేశం నిర్వహించారు. 30 ఏళ్లుగా స్థానిక పరిశ్రమల కాలుష్యతో ప్రజలు, మూగ జీవాలు, జల వనరులు, భూగర్భం ఎలా నష్టపోయిందో వివరించారు. అనంతరం పది రోజులుగా కాజీపల్లిలో ర్యాలీలు, సమీక్షలు నిర్వహించి కాలుష్యపపై పోరాటానికి స్థానికులను సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం సనత్‌నగర్, రామచంద్రాపురంలోని పీసీబీ కార్యలాయాల్లో ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కాని నేపథ్యంలో నిరంతర పోరు, న్యాయ స్థానాల్లో కేసుల దాఖలు చేయాలని నిర్ణయించారు. కాలుష్యాన్ని నియంత్రించ లేని పరిశ్రమలపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం అవుతున్నారు. నియంత్రణ చేపట్టని పరిశ్రమల తరలింపు, జల వనరుల రక్షణే ధ్యేయంగా జేఏసీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు కార్యచరణను చేపట్టారు.

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎంగా శివశంకర ప్రసాద్


శివశంకర ప్రసాద్

కంది, జూన్ 30 : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ నూతన సీజీఎం (చీఫ్ జనరల్ మేనేజర్‌గా)గా శివశంకర ప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ సీజీఎంగా పనిచేసిన కె.సుధాకర్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో అదే పరిశ్రమలో ఓఎస్‌డీ(ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌ను సీజీఎంగా నియమిస్తూ ఆర్మ్‌డ్ వెహికిల్ నిగమ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల సహకారంతో మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని మరింత అభివృద్ధి చేస్తానని నూతన సీజీఎం ప్రసాద్ తెలిపారు.

ఉద్యోగులకు భద్రత కల్పించండి

● జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్‌ను కోరిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు


కంది, జూన్ 30 : మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేసే ఉద్యోగులందరికీ భద్రత కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జటోత్ హుస్సేన్‌ను ఆల్ ఇండియా డిఫెన్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి బి.బాలోజీ కోరారు. హైదరాబాద్‌లోని హరిత హోటల్‌లో ఆదివారం జటోత్ హుస్సేన్‌ను ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కాకుండా చూడాలని, ఉద్యోగులకు ప్రమోషన్లతో పాటు అన్ని రకాల సౌఖర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ త్వరలోనే మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని సందర్శించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్‌ను కలిసిన వారిలో రాములు, రాజు, సంతోష్, కిషన్, రామన్, రాంచందర్ తులసీరాం, హరిరాం, పీవీ రమణ, గోవర్దన్, విట్టల్ తదితరులు ఉన్నారు.


వినతి ప్రతాన్ని అందజేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు

నీట్ రద్దుకు అసెంబ్లీలో తీర్మానించాలి: సీపీఎం

నారాయణఖేడ్, జూన్ 30: నీట్ పరీక్షను రద్దు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అతిమెల మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ దేశానికి కావాల్సిన డాక్టర్లను తయారుచేసే నీట్ పరీక్ష, పేపర్ లీక్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో ఖేడ్ డివిజన్ నాయకులు రమేష్, సతీష్, అరుణ్, రాములు, మోషప్ప, సంతోష్ పాల్గొన్నారు.

రేగోడులో వర్షం


రేగోడులో కురుస్తున్న వర్షం

రేగోడు, జూన్ 30: రేగోడు మండలంలో ఆదివారం ఓ మోస్తారు వర్షం కురిసింది. పత్తి పంటలు సాగుచేస్తున్న రైతులకు ఈ వర్షంతో ఊరట ఇచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హన్మంతాపూర్‌లో ఇసుక వేలం వివాదాస్పదం

నర్సాపూర్, జూన్ 30: నర్సాపూర్ పట్టణ పరిధిలోని హన్మంతాపూర్‌లో ఉన్న చెరువు నుంచి ఇసుక,మట్టి తరలింపునకు శనివారం రాత్రి వేలం పాటకు యత్నించగా.. వివాదాస్పదంగా మారి వాయిదా పడింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంతాపూర్ చెరువు నుంచి ఇసుక, మట్టి, మొరం తరలింపునకు వేలం వేసేందుకు గ్రామంలో చాటింపు వేశారు. అయితే వేలం పాట సంబంధిత అధికారుల సమక్షంలో నిర్వహించాల్సి ఉండగా.. వారికి సమాచారం లేకుండానే కొందరు నాయకుల ప్రమేయంతో వేలంకు యత్నించారు. దీంతో వివాదం చెలరేగి వాయిదా పడింది.

కానిస్టేబుల్ హఠాన్మరణం.. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

● విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు


అధికారం లాంఛనాలతో నిర్వహిస్తున్న అంత్యక్రియలు

సిద్దిపేట అర్బన్, జూన్ 30 : హెడ్ కానిస్టేబుల్‌గా కె.యాదగిరి(53) హఠాన్మరణం చెందగా పొన్నాల గ్రామంలో ఆదివారం అంత్యక్రియలను అధికార లాంఛనలతో నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా శనివారం రాత్రి గుండెపోటు రావడంతో సీఐ విద్యాసాగర్, సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే హార్ట్‌ఎటాక్‌తో యాదగిరి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, సిద్దిపేట ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ ఇతర సిబ్బంది మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహింపజేశారు. పోలీస్ కమిషనర్ అనురాధ ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ప్రభుత్వం తరఫున రూ.20 వేలు మృతుడి కుటుంబానికి పోలీస్ సిబ్బంది అందజేశారు. యాదగిరికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అంత్యక్రియల కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, త్రీ టౌన్ ఎస్ఐ విజయభాస్కర్, ఆర్ఎస్ఐ సాయి చరణ్, పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, త్రీ టౌన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ కడుపులో నుంచి 10 కిలోల కణితి తొలగింపు

మెదక్ కల్చరల్, జూన్ 30 : కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులో నుంచి 10 కిలోల కణితిని ఆపరేషన్ చేసి తొలగించారు మెదక్ పట్టణంలోని శ్రీసాయి చంద్ర నర్సింగ్ హోంకు చెందిన వైద్యులు డాక్టర్ సురేష్. టేక్మాల్ మండలం స్లకాన్‌కుంట తండాకు చెందిన ముడవత్ బుజ్జి కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పి బాధపడుతున్నది. అయితే ఎంతో మంది దగ్గర వైద్యం తీసుకున్నా ఉపశమనం కలగకపోవడంతో శనివారం రోజున వైద్యుడు సురేష్‌ను సంప్రదించగా పరీక్షించిన అనంతరం కడుపులో కణిఒతి ఉందని తెలిపి శస్త్ర చికిత్స చేసి తొలగించారు. వైద్యుడు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యం బాగుందని ఆసుపత్రిలో కోలుకున్న అనంతరం డిశ్చార్జ్ చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు వైద్యుడికి కృతజ్ఞతలు తెలుపారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్‌షిప్ రద్దు

● సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని

సంగారెడ్డి రూరల్, జూన్ 30 : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్‌షిప్ ఎను రద్దు చేస్తామని సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని హెచ్చరించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని పీఏసీఎస్, ఎరువుల దుకాణాల్లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎరువులను ఈపాస్ మెషిన్ ద్వారానే విక్రయించాలని, ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మొద్దని ఆదేశించారు. అనంతరం పీఏసీఎస్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏవో ఏబీజీకే ప్రసాద్, సొసైటీ అధికారులు ఆంజనేయులు, ఇందిరా, కవిత, నరేష్, అరుణ్,


గొల్లపల్లిలో అభిప్రాయ సేకరణలో డీఏవో అంబికా సోని

పీఎం కిసాన్ తరహాలో రైతు భరోసా ఇవ్వండి

కొండాపూర్, జూన్ 30 : పీఎం కిసాన్ తరహాలో రైతు భరోసా అందించే విధంగా చూడాలని రైతులు వెల్లడించారు. కొండాపూర్ మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణలో డీఏవో పాల్గొన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ అరగుంట భూమి ఉన్న ఒక ఎకరం డబ్బు వచ్చేలా పీఎం కిసాన్ యోజన తరహాలో పథకాన్ని అమలు చేయాలని కోరారు. పరిమితి చేస్తే సన్నకారు రైతులకు మేలు జరుగుతుందన్నారు. పది ఎకరాలలోపు రైతులకు వర్తించేలా చూడాలని కోరారు. కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేస్తే పట్టాదారులకు పథకం వర్తిస్తుందా అని ప్రశ్నించారు. రైతులకు మేలు చేకూర్చే విదివిధానాలను రూపొందించాలన్నారు. మండల వ్యవసాయాధికారి గణేష్, ఏఈవో మధు తదితరులు పాల్గొన్నారు.

కిరాణాషాపుల్లో పోలీసుల తనిఖీలు

కల్హేర్, జూన్ 30 : సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్ గ్రామంలోని కిరాణాషాపుల్లో గుట్కా అమ్మకాలపై పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న కిరాణాషాపుల్లో గుట్టుచప్పుడు కాకుండా గుట్కా అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించినట్లు ఏఎస్ఐ రవిందర్‌గౌడ్ తెలిపారు. తనిఖీల్లో ఎలాంటి గుట్కా పాకెట్లు లభించలేదని ఆయన పేర్కొన్నారు. ఎక్కడైనా గుట్కా పాకెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండలానికి సరిహద్దున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి భారీగా గుట్కా పాకెట్లు ఇక్కడికి రవాణా అవుతున్నాయని ఏఎస్ఐ తెలిపారు.

గురుకుల పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

● ప్రిన్సిపాల్ నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం


ఆందోళన చేస్తున్న పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కవిత

చేర్యాల, జూన్ 30 : చేర్యాల పట్టణంలోని నర్సాయిపేట బాలికల గురుకుల ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు ఆదివారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల నోటి దురుసుతో ప్రవర్తిస్తుండటం తగదని మండిపడ్డారు. ఇటీవల ఓ విద్యార్థినిని కులం పేరుతో దూషించడంతో పాటు పాఠశాలలో తాగునీటి వసతి సరిగాలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకునేందుకు వస్తే అమర్యాదపూర్వకంగా వ్యవహరించారన్నారు. మూత్రశాలలు, డ్రైనేజీ సరిగ్గా లేవని, కొద్దిరోజులుగా భోజనం సరిగ్గా వండకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ ఫ్యాన్లు, ఇతరత్రా సామగ్రిని ప్రైవేటు గదిలో డంప్‌చేసి పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆయా అంశాలపై మాట్లాడటానికి వస్తే పట్టించు కోలేదని, ఈ విషయమై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలిసిన పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని తల్లిదండ్రులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఆయా సమస్యలను నెలరోజుల్లో పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ కవిత హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకున్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొండ్ర లావణ్య, ప్రతినిధులు అనంతుల కల్పన, వద్దెల యాదగిరి, సురేశ్, కుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా నిధుల కేటాయింపు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్

నర్సాపూర్, జూన్ 30: నర్సాపూర్ మున్సిపల్ నిధులను ఇష్టానుసారంగా వెచ్చిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం నర్సాపూర్‌లో బీజేపీ కౌన్సిలర్లు రాజేందర్, సురేష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ అధికారులు నిధుల కేటాయింపులో తీవ్ర వివక్ష చూపుతున్నారన్నారు. బీజేపీ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు అతి తక్కువ నిధులు కేటాయిస్తూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్లకు పెద్దమొత్తంలో కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ వాహనాలకు వినియోగించే డీజిల్ విషయంలో చాలా అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో ఉన్న బిల్లులకు.. ప్రస్తుతం ఉన్న బిల్లులకు తేడా చూస్తే.. ప్రస్తుతం మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి ఏ మేర ఉందో అర్థమవుతుందన్నారు.

వార్షికోత్సవాలకు సాయిబాబా ఆలయం ముస్తాబు

నారాయణఖేడ్, జూన్ 30: నారాయణఖేడ్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయాన్ని 9వ వార్షికోవానికి సిద్ధం చేస్తున్నారు. సాయిబాబా ఆలయాన్ని 9 ఏళ్ల క్రితం నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అప్పటి నుంచి ప్రతియేటా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూలై 3న వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఉదయం 5 గంటలకు కాకడ హారతి, గణపతిపూ, మహాహారతి, గణపతి, దత్తాత్రేయ రుద్రహవనం, మధ్యాహ్నం 12 గంటలకు చప్పన్‌భోగ్‌ప్రసాదాల సమర్పణ, మహాత్ముల ప్రవచనాలు, మహాప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు డోలోత్సవం, పల్లకీ సేవ, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అందువల్ల ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.


ఖేడ్‌లోని సాయిబాబా ఆలయం

పరిహారం.. పరిహాసం

నిమ్జ్ భూనిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లింపులో గోల్‌మాల్

మొదటి విడత భూసేకరణ ప్రక్రియలో అక్రమాలు

ఏళ్లుగానిమ్జ్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న నిర్వాసితులు

జహీరాబాద్, జూన్ 30 : జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో చేపట్టిన జాతీయ పెట్టుబడి, ఉత్పాదక మండలి(నిమ్జ్) ప్రాజెక్టు భూసేకరణకు ప్రక్రియ పరిహాసంగా మారింది. ఓవైపు భూసేకరణ నత్తనడకన కొనసాగుతుండగా మరోవైపు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లింపులో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాజెక్టు ప్రకటించిన అనంతరం మొదటి విడతగా చేపట్టిన భూసేకరణ, పరిహారం చెల్లింపులకు సంబంధించి అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అసైన్డ్ భూములకు సంబంధించి గోల్‌మాల్ వ్యవహారం కొనసాగినట్లు భూనిర్వాసితులు మండిపడుతున్నారు. పరిహారం కోసం నిర్వాసిత రైతులు ఇంకా నిమ్జ్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

మూడు దశలుగా భూసేకరణ

2012-13 సంవత్సరంలో రూ.31 వేల కోట్ల పెట్టుబడి, 3 లక్షల మందికి ఉద్యోగం, ఉపాధి కల్పించే లక్ష్యంతో ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో నిమ్జ్ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2016లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రెండు మండలాల్లోని 17 గ్రామాల్లో 7,045 మంది రైతుల నుంచి 12,635 ఎకరాల భూసేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. భూసేకరణను మూడు విడతలుగా విభజించారు. 2016-17లో మొదటి విడత కింద ఝరాసంగం న్యాల్‌కల్ మండలాల పరిధిలోని చీలపల్లి, ఎల్గోయి, బర్దీపూర్, న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్, ముంగి గ్రామాల్లో 4,462 ఎకరాలకుగాను 3,596 ఎకరాలను మాత్రమే సేకరించారు. రెండో విడతలో న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్, హంసెల్లి, గుంజెట్టి, హద్నూర్ న్యామ్తాబాద్, మామిడిగి, కల్‌బేమల్, మెటల్‌కుంట, రేజింతల్, గంగ్వార్, మల్కన్‌పాడ్, బసంతాపూర్ ఈ 12 గ్రామాల నుంచి 8,172 ఎకరాలను సేకరించాల్సి ఉంది. ఆయా గ్రామాల నుంచి 2022 వరకు 500 పైచిలుకు ఎకరాలను మాత్రమే సేకరించారు. మూడో విడతలో నిమ్జ్‌కు వెళ్లేందుకు వీలుగా రూ.100 కోట్ల వ్యయంతో 100 ఫీట్ల వెడల్పుతో రోడ్డును నిర్మించేందుకు భూసేకరణ చేశారు. జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లోని 229 మంది రైతుల నుంచి 65 ఎకరాలను నిమ్జ్ అధికారులు సేకరించారు. ఇందుకు రైతులకు రూ.7.50 కోట్లు పరిహారాన్ని చెల్లించింది. జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామ సమీపం నుంచి 65వ జాతీయ రహదారికి ఆనుకుని క్రిష్టాపూర్, మాచ్నూర్ గ్రామాల శివారుల మీదుగా 9 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ప్రారంభ సమయంలో మొదటివిడతలో భాగంగా రైతులకు ఎకరాకు రూ.3లక్షలు, రూ.4.50 లక్షలు, రూ.5 లక్షల వరకు అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తమకు గిట్టుబాటు కావడం లేదంటూ కొందరు రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు 2013 చట్టం ప్రకారం ప్రస్తుతం ఎకరాకు రూ.15 లక్షల చొప్పున ఇచ్చేందుకు నిర్ణయించారు.


ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల పరిధిలోని నిమ్జ్ ప్రాంతం



నిమ్జ్ ప్రాజెక్టు భూముల్లోని బోర్డు

భూమి కుదించి.. పరిహారం కాజేసి..

నిమ్జ్ ప్రాజెక్టు కోసం 17 గ్రామాల్లో సేకరించాల్సిన భూముల్లో సుమారు 5 వేల ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. 2005-06లో కేంద్ర ప్రభుత్వం ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని చీలపల్లి, బర్దీపూర్, రుక్మాపూర్, ముంగి, ఎల్గోయి గ్రామాల్లో పలువురు రైతులకు 200 ఎకరాల పట్టాలను పంపిణీ చేసింది. అందులో కొందరికి భూకేటాయింపులు జరగగా, మరికొందరికి ఇవ్వలేదు. మొదటి విడత నిమ్జ్ భూసేకరణలో ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో కేంద్ర ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన పట్టా భూమి కూడా ఉంది. ఈ పట్టా భూములకు సంబంధించి రికార్డుల్లో ఎక్కువ భూమి ఉండగా, కాస్తు(సాగు)లో మాత్రం తక్కువగా ఉన్నది. ఇక్కడే భూసేకరణ అధికారులు గోల్‌మాల్‌కు తెరలేపారు. సుమారు 300 ఎకరాల పైచిలుకు ఇతర రైతుల భూములను రికార్డుల్లో నుంచి కుదించారు. 500 ఎకరాలకు సంబంధించి కొత్త పాసుపుస్తకాలను సృష్టించి రైతులకు అందజేశారు. వాటిని నిమ్జ్ కోసం సేకరించి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం పంపిణీ అంతా గందరగోళంగా సాగింది. రికార్డుల్లో భూములు తగ్గిన రైతులు తమకు మిగిలిన భూముల పరిహారం ఎప్పుడిస్తారంటూ అధికారుల చుట్టూ ఇప్పటికీ తిరుగుతూనే ఉన్నారు. ఆయా గ్రామాల్లో అధికారుల లెక్కల ప్రకారం ప్రభుత్వ భూమి అంతా అయిపోయింది. వారి భూమికి సంబంధించి పరిహారమైతే ఎక్కడ పోయిందనే విషయం మాత్రం కొంతమంది రైతులకు అంతుబట్టనిదిగా ఉంది. ఐదు గ్రామాలకు సంబంధించి పరిహారం ఇచ్చిన రైతుల వివరాలను ఆయా గ్రామాల్లోనే గ్రామసభలు పెట్టి చదివి వినిపిస్తే ఈ అక్రమాలు బహిర్గతమయ్యేవి. కానీ నిర్వాసితుల నుంచి వసూళ్లకు పాల్పడిన అధికారులు తమ చాకచక్యంతో తప్పించుకున్నారు. పరిహారం చెల్లింపుల్లో రూ.20 కోట్ల పైచిలుకు అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిమ్జ్ భూసేకరణలో మాత్రం ఒక్కో రైతు ఆవేదన ఒక్కో రకంగా ఉంది. బోర్లు, బావులు, చెట్లకు సంబంధించిన పరిహారం ఇంకా ఇవ్వాల్సి ఉంది. దీని కోసం నిర్వాసితులు నిమ్జ్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే ఆయా మండలాల్లో పనిచేసిన కొందరు అధికారులనే నిమ్జ్ ప్రాజెక్టు భూసేకరణకు నియమించగా, వారు ఉన్నతాధికారులను సైతం తప్పుదోవపట్టిస్తు ఇలా అక్రమాలకు తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా మొదటి విడత భూసేకరణ చేపట్టిన 2016 నుంచి 2019 మధ్య జరిగిన వ్యవహారం. కొంత కాలం క్రితం నిమ్జ్‌లో జరిగిన ఈ తతంగమంతా ఉన్నతాధికారులకు తెలియడంతో దీనిని అరికట్టి, భూసేకరణ సమస్యను కొలిక్కి తెచ్చేందుకు జహీరాబాద్ నిమ్జ్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించారు. అప్పటి నుంచి భూసేకరణ ప్రక్రియ అంచెలంచెలుగా వేగవంతమైంది.

నా పొలంలో నుంచి ఎకరా భూమిని కుదించారు



నాకు గ్రామ శివారులోని 125/6 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాల వ్యవసాయం పొలం ఉంది. దీనిని మా కుటుంబం తరతరాలుగా సాగుచేస్తున్నాం. 5 ఎకరాల నుంచి ఎకరా భూమిని తగ్గించి పరిహారం ఇచ్చారు. ఐదు ఎకరాలకు ఇవ్వాలని వేడుకుంటే ఇష్టం ఉంటే తీసుకో లేకుంటే న్యాయస్థానంలో జమ చేస్తామంటు అధికారులు ఒత్తిడి తెచ్చారు. తప్పని పరిస్థితుల్లో తీసుకోవాల్సి వచ్చింది. మరో ఎకరాకు సంబంధించిన డబ్బు ఇవ్వాలంటూ నిమ్జ్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా.

\- కిష్టయ్య, భూనిర్వాసితుడు, ఎల్గోయి

చెట్లు, బోరుబావులకు సంబంధించి రూ.3 లక్షలు ఇవ్వాలి



మా భూమిని నిమ్జ్ అధికారుల ఆదేశాల మేరకు అప్పగించాం. అందులో బోరుబావులు, చెట్లకు సుమారు రూ.3 లక్షల పరిహారం రావాల్సి ఉంది. ఐదేళ్లుగా నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ఇదిగో, అదిగో వస్తాయంటూ చెపుతున్నారే తప్ప ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులకు సైతం విన్నవించిన ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించేలా కృషి చేయాలి.

\- అమృత్, భూనిర్వాసితుడు, బర్దీపూర్

రైతులకు న్యాయం చేసేందుకు కృషి



రైతులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి భూములను అప్పగిస్తే ప్రయోజనం ఉంటుంది. లేదంటే న్యాయస్థానంలో నష్టపరిహారం డబ్బును జమచేస్తాం. నిబంధనల ప్రకారం చెల్లింపులు చేస్తున్నాం. నిర్వాసితులకు నేరుగా చెక్కులను అందజేస్తున్నం. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. గతంలో జరిగిన అక్రమాల విషయాన్ని పరిశీలిస్తున్నాం. ఈ విషయాన్ని అంతా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవు.

\- కొల్లు నాగలక్ష్మి, నిమ్జ్ ప్రాజెక్టు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

పంట రుణమాఫీ అద్భుత పథకం

● సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు
● ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.451 కోట్లు మాఫీ
● డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

వర్గల్, జూన్ 30 : రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పంట రుణమాఫీ అద్భుతమైన పథకమని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ ఆలయాన్ని ఆయన కుటుంబ సభ్యులతో సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రైతుల సంక్షేమం కోసం ఒకే దఫాలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా చరిత్రలో నిలువనున్నట్లు తెలిపారు. గతంలోనూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పంట రుణమాఫీ ఒకే దఫాలో చేయగా నేడు అదే బాటలో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పతనమన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేయనున్న పంట రుణమాఫీలో మెదక్ డీసీసీబీ ద్వారా రూ.451 కోట్లు రుణాలు మాఫీ కానున్నట్లు తెలిపారు. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో 57,585 మంది రైతులకు రుణమాఫీ పథకం ద్వారా ప్రయోజనం దక్కుతుందన్నారు. రైతులకు వివిధ రకాల రుణాలతో పాటు గృహాలు నిర్మించుకునేందుకు గాను గ్రామీణ ప్రాంతాలు అయితే రూ.40లక్ష వరకు, పట్టణ ప్రాంతాలైతే రూ.75లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ ద్వారా చిరు వ్యాపారులకు, మహిళా సంఘాలకు, వాహనాల కొనుగోలుకు ఉన్నత చదువుల కోసం రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 55 డీసీసీబీ బ్యాంకుల ద్వారా ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలను అందిస్తున్నట్లు వివరించారు. వినియోగదారులకు సేవలను మరింత చేరువ చేసేందుకు 28ఏటీఎంలు అందుబాటులోకి తెచ్చినట్లు, రూ.600 కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించినట్లు వివరించారు. విద్యా సరస్వతీ అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని, భక్తుల సౌకర్యాల కల్పనలో కృషి చేస్తున్న ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి కృషి ఎంతో ఉందన్నారు.


మాట్లాడుతున్నచిట్టి దేవేందర్‌రెడ్డి

మహిళా కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలిగా సుజాత


నియామక పత్రాన్ని అందుకుంటున్న సుజాత

హత్నూర, జూన్ 30: మహిళా కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలిగా హత్నూర మండలం కొన్యాల మాజీ సర్పంచ్ దానంపల్లి సుజాత ముదిరాజ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆదివారం నియమాకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన సుజాత మాట్లాడుతూ మెదక్ జిల్లా అధ్యక్షురాలుగా ఎంపిక చేసినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ పేద ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. నియామకపత్రం అందజేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు శేషాసాయిరెడ్డి, నర్సాపూర్ మండల ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, హత్నూర మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ నర్సాపూర్ మండల అధ్యక్షుడు మల్లేశం, వల్పనూర్ సర్పంచ్ ఆంజనేయులు మండల నాయకులు సత్యం, వెంకటేశం, సాధిక్ యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, సందీప్, రాము, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో మల్లన్న భక్తులపై దాడి

● పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘటన
● రాడ్, కర్రలతో యువకుల దాష్టీకం
● పలువురికి గాయాలు... ఏడుగురిపై కేసు : చేర్యాల సీఐ శ్రీను


దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చేర్యాల, జూన్ 30 : గంజాయి సేవించిన మత్తులో కొమురవెల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం అర్థరాత్రి మల్లన్న భక్తులపై దాడికి పాల్పడ్డారు. షాక్‌అబ్జర్ రాడ్, కర్రలతో దాష్టీకానికి ఒడిగట్టారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే సంఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన జాగరి కరుణాకర్, కలం సాయి వెంకట్, జశ్విన్‌లు తమ మిత్రులతో కలిసి శనివారం రాత్రి మల్లన్న దర్శనార్థం కొమురవెల్లికి చేరుకున్నారు. టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గదుల విచారణ కార్యాలయం దారి గుండా వెళుతున్నారు. ఇదే సమయంలో కొమురవెల్లి గ్రామానికి చెందిన పేర్ని శివమణి, రంగు రాజు, దేశెట్టి రవి, పండుగ పవన్, దేశెట్టి వినయ్, కొరివి ఎలియాస్ సార్ల నవీన్, శ్రీకాంత్ ఎలియాస్ చింటు తదితరులు గంజాయి సేవించిన మత్తులో ఉండి తమను గేలిచేస్తున్నారని కొందరితో ఘర్షణకు దిగారు. కర్రలు, బైక్ షాక్‌అబ్జర్ రాడ్‌తో కరుణాకర్, సాయి వెంకట్, జశ్విన్‌లపై దాడికి పాల్పడ్డారు. కరుణాకర్ తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. అరుపులు విన్న చుట్టుపక్కలవారు, ఆలయ సిబ్బంది వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. విషయాన్ని స్థానిక పోలీసులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకుని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారివద్ద గంజాయితో కూడిన తంబాకు లభ్యమైంది. ఇదిలా ఉండగా, పట్టుబడిన వారిలో పలువురు యువకులు చాన్నాళ్లుగా నానా హంగామా చేస్తున్నారని, ఇష్టానుసారం బైక్‌లు నడుపుతూ భయాందోళనకు గురిచేస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఓ యువకుడు కొంతకాలంగా కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. అతడు గంజాయి బ్యాచ్ దొరకకుండా విషయాలను బయటకు చెబుతూ అప్రమత్తం చేస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టచర్యలు చేపట్టడంతో పాటు దాడులు జరగకుండా ఆలయాధికారులు చొరవ వహించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ఈ దాడికి సంబంధించి చేర్యాల సీఐ శ్రీను విచారణ చేపట్టారు. భక్తులపై దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసుమోదు చేశామని, కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.


పట్టుబడిన గంజాయి మిశ్రమంతో కూడిన తంబాకు

మల్లన్న క్షేత్రం.. భక్తజనసంద్రం


స్వామివారి నిత్య కల్యాణంలో, ముఖమండపంలో పెద్దపట్నం రచించి మొక్కులను తీర్చుకుంటున్న భక్తులు



చేర్యాల, జూన్ 30 : కొమురవెల్లి మల్లన్న ఆలయం భక్తజనసంద్రంగా మారింది. స్వామివారి సందర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు మొక్కు బడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టి కుండలో బోనం చేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడి బియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత దర్శనం క్యూలైన్లలో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవోలు బుద్ధి శ్రీనివాస్, గంగా శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


విశేష అలంకరణలో దర్శనం ఇస్తున్న వనదుర్గమ్మ

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం కిటకిట

వర్గల్, జూన్ 30 : మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో క్షేత్రానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రద్దీ అధికంగా ఉండటంతో క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. స్వామివారి దర్శనంతో పాటు క్షేత్రంలోని సీతారాముల స్వామి, శివాలయం, దత్తసాయి మందిరం, హనుమాన్ ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. 13 మంది దంపతులతో సత్యనారాయణ వ్రతం, 9 మంది దంపతులు స్వామివారికి నిజాభిషేకాలు, 3 జంటలు స్వామివారికి కల్యాణం జరిపించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. భక్తులు సౌకర్యార్థం ఆలయం వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.


నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

దుర్గమ్మ దీవించమ్మా

పాపన్నపేట, జూన్ 30 : ఏడుపాయల దుర్గమ్మ సేవలో భక్తులు తరించారు. వనదుర్గమ్మ మమ్మిలను దీవించమ్మా అంటూ.. వేలాది భక్తులు ఆదివారం అమ్మ వారిని దర్శించుకున్నారు. అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు బోనాలు తీసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పచ్చని చెట్ల కింద టెంట్లు వేసుకొని విందు చేసుకుని, సాయంత్రం వరకు ఏడుపాయల సన్నిధిలో గడిపారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా చైర్మన్ బాలగౌడ్, సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

తప్పుల సవరణ చేసేది ఎప్పుడు?

- ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో పొరపాట్లు
- డాటా ఎంట్రీలో ఆపరేటర్ల నిర్లక్ష్యం
- ఎంతోమందికి అందని ఆరు గ్యారంటీలు



పోతారం(ఎస్)లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, జూన్ 30: ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల కింద లబ్ధిపొందేందుకు అర్హుల నుంచి జనవరిలో ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. అయితే దరఖాస్తుదారుల వివరాల నమోదు చేసే క్రమంలో డాటా ఎంట్రీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తప్పులు దొర్లాయి. దీంతో వేలాది మంది అర్హులకు ఆరు గ్యారంటీ పథకాలు అందలేదు. ఈ క్రమంలో తప్పుల సవరణకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ పెరిగింది. కానీ లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దరఖాస్తుల వివరాల నమోదు సవరణకు వకాశం లేకుండా పోయింది. ఇటీవల ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వం ఇంకా దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంతో గ్రామీణ ప్రాంతాల పేదలు పథకాలను పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

పకడ్బందీగా దరఖాస్తుల స్వీకరణ

ఆరు గ్యారంటీల కోసం అర్హుల నుంచి ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు దరఖాస్తులను స్వీకరించింది. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేసి ఎంతో పకడ్బందిగా గ్రామ సభల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. వారం రోజుల్లో దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేశారు. ఆ తర్వాత కూడా ఎవరైనా మిగిలిపోయిన వారు ఉంటే మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాటు చేశారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా తదితర పథకాల కోసం ఆశావహులు భారీగానే దరఖాస్తులను అందించారు.

ఆపరేటర్ల నిర్లక్ష్యంతో తప్పులు..

జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు దశల వారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలు అమలు చేయడానికి స్వీకరించిన ఈ దరఖాస్తులను ప్రభుత్వం ప్రత్యేక సిబ్బంది ద్వారా ఆన్‌లైన్ చేయించింది. ఈ క్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు చాలా చోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆన్‌లైన్ పనిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. నమోదులో పొరపాట్లు దొర్లాయి.

తప్పుల సవరణకు అవకాశం

దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాల సవరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. తప్పులు దొర్లిన దరఖాస్తులను సవరించేందుకు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యాలయాలు, మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పట్టణాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ సేవా కేంద్రాల్లోనే సవరణకు అవకాశం కల్పించింది. దీంతో సవరణ కోసం దరఖాస్తు కేంద్రాలకు ప్రజలు పెద్దఎత్తున పోటెత్తారు.

అడ్డంకింగా ఎన్నికల కోడ్

ఇంతలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో అప్పటి వరకు అంతంత మాత్రంగానే నడుస్తున్న ఈ ప్రక్రియ సైట్‌లు మూతబడ్డాయి. ఫలితంగా గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద రూ. 500 వంట గ్యాస్ పంపిణీ లబ్ధిని అనేక మంది పొందలేకపోయారు. ఎన్నికల కోడ్ ముగిసినా ప్రజాపాలన సైట్ తెరవకపోవడంతో అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు బుగ్గలే ఉన్నాయి



మా ఇంట్లో వెలిగేవి రెండు బుగ్గలే అయినా మాకు గృహలక్ష్మి పథకం అమలుకావడం లేదు. ప్రజాపాలనలో ఆరుగ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా మా ఇంటి పక్కవాళ్లకు జీరో బిల్ వస్తున్నది. మాకు మాత్రం బిల్లుకట్టాలని వస్తున్నది. సవరణ కోసం మండల ఆఫీసులో దరఖాస్తు ఇచ్చాను. అప్పుడు ఎన్నికల కోడ్ అన్నారు. ఇప్పుడు వెలితే సైట్ ఓపెన్‌కాలేదని అధికారులు చెబుతుండ్రు ఎట్లా సార్ ఏం చేయాలి మేము. సవరణ చేసి జీరో బిల్లువచ్చే విధంగా చూడాలి.

- బొల్లి అయిలవ్వ, రాములపల్లి

సైట్ ఇంకా ఒపెన్ కాలేదు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల కోసం మండల వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తులు 7140 స్వీకరించాం. ఇందులో సవరణల కోసం 641 దరఖాస్తులు పరిశీలించి పంపాం. రేషన్, ఆధార్ కోసం 432, వంట గ్యాస్‌కు 393, ఉచిత విద్యుత్ పథకం కోసం 528 దరఖాస్తులు సవరణ కోసం పంపాం. ప్రభుత్వం సైట్ ఓపెన్ చేసినట్లు చెబుతున్నా జిల్లా నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు.

- వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో హుస్నాబాద్

హామీల అమలుకు ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ. అబ్బాస్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

చేర్యాల, జూన్ 30: ఎన్నికలముందు ప్రజలకు ఇచ్చిన హామీ, వాగ్ధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్నాయని, పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ. అబ్బాస్ పేర్కొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో రెండురోజులపాటు నిర్వహించే సీపీఎం సిద్దిపేట జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలపై తీవ్ర భారం పడిందన్నారు. బొగ్గుగనులను ప్రైవేటు పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టేందుకు కేంద్రం వేలంపాటలను తెరమీదకు తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల అమలులో విఫలమవడంతో మాయమాటలతో కాలం వెళ్లదీస్తూ ప్రజాసమస్యలను గాలికొదిలేసిందన్నారు. రైతుభరోసా, రేషన్‌కార్డులు, మహిళకు రూ.2500, ఇళ్లు, ఇళ్లస్థలాలు, కల్యాణలక్ష్మి వంటివి అమలు చేయకుండా వంచిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు రాళ్లబండి శశిధర్, కాముని గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, నక్కల యాదవరెడ్డి, నందనబోయిన ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగంలో టీజీఆర్టీసీ పాత్ర గొప్పది

- గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా


ఉద్యోగులను సన్మానిస్తున్న సీఐ సైదా, డిపో మేనేజర్ సురేఖ

గజ్వేల్, జూన్ 30: రవాణా రంగంలో టీజీఆర్టీసీ పాత్ర గొప్పదని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని బస్ డిపోలో టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశానుసారం చేపట్టిన లక్షే లక్ష్యంలో భాగంగా ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువ ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, డ్రైవర్లను, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు బహుమతుల ప్రదానం, సన్మాన కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.సురేఖతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. రవాణా రంగంలో ఆర్టీసీ పాత్ర గొప్పదని, ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. డిపోకు అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు శ్రీనివాస్, నాగేందర్, ఎంఎం రాణి, రాందాసు, ఎంఎస్‌రెడ్డి, డ్రైవర్లు వలీయోద్దీన్, ఎంఎస్ నారాయణ, సీహెచ్ నరేందర్, జీకే మూర్తి, శ్రీనివాస్‌లను సన్మానించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆర్టీసీ సిబ్బంది పిల్లలు సుప్రిత, అక్షిత, వర్షిణీలను ఘనంగా సన్మానించి, బహుమతులు అందజేశారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, కండక్టర్లు ఎంఎస్‌రెడ్డి, జేఆర్‌రెడ్డి, స్వాతి, లక్ష్మయ్య, పీఎస్ రాణి, నాగేందర్, రజిత, నాగరాజు, ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే, అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలి

- అంబేడ్కర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాములు, కిష్టయ్య


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

గజ్వేల్, జూన్ 30: జ్యోతిబాపూలే, అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని అంబేడ్కర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అటకూరి రాములు, మస్కూరు కిష్టయ్యలు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి సమాన హక్కులు, పనికి సరిపడా వేతనం అందుతుందంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పుణ్యమేనన్నారు. అందుకు ప్రభుత్వం వారి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని కోరారు. వారితో నాయకులు మన్నె కృష్ణ, బొల్లారం ఎల్లయ్య, తుమ్మ శ్రీనివాస్, పంబాల సత్యనారాయణ, నంగునూరి సత్యనారాయణ, నాగయ్య, బాలయ్య తదితరులున్నారు.

'జనసేన బలోపేతానికి కృషి'

సిద్దిపేట అర్బన్, జూన్ 30: జనసేన పార్టీని రాష్ట్రంలో, సిద్దిపేట జిల్లాలో బలోపేతం చేయడానికి కృషి చేస్తామని జనసేన పార్టీ నాయకులు మురార్‌కార్ సాయికుమార్, శివకుమార్, ధర్మేందర్‌లు పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాకతో సిద్దిపేట జిల్లాలో జనసేనకు ఊపు వచ్చిందని అన్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు వచ్చిన జనసైనికులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. సమావేశంలో కనకరాజు, రాజేష్, కన్నయ్య, ప్రసాద్, భరత్, దినేష్, మల్లేశం పాల్గొన్నారు.

ఏకలవ్య ఎరుకల సంఘం ఎన్నికలు

సిద్దిపేట అర్బన్, జూన్ 30: సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం ఎన్నికలు ఆదివారం సిద్దిపేటలో ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి కెమ్మసారం రాజేశ్వర్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏకలవ్య కమ్యూనిటీ భవన్‌లో పోలింగ్ అధికారి ఎన్.డాకయ్య, ఎన్నికల నిర్వహణ అధికారి కె.రాజేశ్వర్ ఆధ్వర్యంలో సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ అధికారి మాట్లాడుతూ.. సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం ఎన్నికల్లో అధ్యక్ష పదవిని కెమ్మసారం రాజేష్ ఖన్నా చేజిక్కించుకున్నట్లు తెలిపారు. కెమ్మసారం నాగరాజు ప్రధాన కార్యదర్శి పదవిని చేజిక్కించుకున్నట్లు తెలిపారు.

'ఉద్యోగ విరమణ సహజం'

మిరుదొడ్డి, జూన్ 30: జీవితంలో ఉద్యోగ విరమణ సహజమని మిరుదొడ్డి ఎంపీపీ గజ్జల సాయిలు అన్నారు. మిరుదొడ్డి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం సూపరింటెండెంట్ నారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజు, ఎంపీటీసీలు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

వీరశైవాగమ వేదపాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చేర్యాల, జూన్ 30: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిధిలోని వీరశైవాగమ వేదపాఠశాలలో ప్రవేశాల కోసం ఆదివారం అర్హతపరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా 20మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాశారు. సిద్దిపేటతో పాటు పొరుగు జిల్లాల నుంచి తరలివచ్చారు. ఈవో బాలాజీశర్మ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అర్హత సాధించిన వారికి స్థానిక వేదపాఠశాలలో వేదాలు నేర్పించనున్నట్లు తెలిపారు.

వనమహోత్సవానికి సిద్ధం

- మండల వ్యాప్తంగా 95 వేల మొక్కలను నాటడమే లక్ష్యం


చౌటపల్లి నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

అక్కన్నపేట, జూన్ 30: పతో విడత వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. 31 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేకంగా నీటి సరఫరా చేస్తూ, ఒక్కో నర్సరీలో 6 వేల మొక్కల చొప్పున 1.86 లక్షల మొక్కలు సిద్ధంగా ఉంచారు. వనమహోత్సవంలో తొమ్మిదో విడతలో నాటిన మొక్కలు 85 శాతం బతికాయని, అదే స్ఫూర్తితో పదో విడతను కూడా విజయవంతం చేసేందుకు ఉపాధిహామీ పథకం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కార్యాచరణ రూపొందించనున్నారు.

నర్సరీలో పెంచిన మొక్కలు

వేప, నిమ్మ, అల్లానేరేడు, జామ, సపోటా, జమ్మి, బత్తాయి, బొప్పాయి, గోరింటాకు, పారిజాతం, కానుగ, ఇప్ప, గులాబి, తులసి, మర్రి, టేకు, అశోక, ఈత, నీలగిరి, తుమ్మ, చామంతి, మల్లె, మద్ది, సంపంగి, మందారం, శ్రీ గంధం, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. వనమహోత్సవంలో భాగంగా ప్రభుత్వ స్థలాల్లోనే కాకుండా ఖాళీ స్థలాల్లో కూడా నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇళ్ల దగ్గర నాటడానికి అవసరమైన మొక్కలనూ పంపిణీ చేయనున్నారు.

ప్రతీ మొక్కను రక్షించేందుకు చర్యలు



గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. మండల వ్యాప్తంగా 95 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఒక్కొక్క నర్సరీల్లో 16 రకాల మొక్కలను పెంచాం. ప్రతి మొక్క చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం. మొక్కలు ఎండిపోకుండా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తాం.

- ప్రభాకర్, ఏపీవో, అక్కన్నపేట

మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా చెరుకు సుమలత


నియామకపత్రం అందుకుంటున్న సుమలత

చేర్యాల, జూన్ 30: కాంగ్రెస్ మహిళా విభాగం సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌కు చెందిన చెరుకు సుమలత నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మహిళాకాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మంద లక్ష్మి చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షుడి నియామకం


మల్లేశంగౌడ్

గజ్వేల్, జూన్ 30: లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షుడిగా అన్నెబోయిన మల్లేశంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపాడు.

వైశ్యసంఘం పట్టణ అధ్యక్షుడిగా వంగపల్లి శ్రీనివాస్

చేర్యాల, జూన్ 30: ఆర్యవైశ్య మహాసభ చేర్యాల పట్టణాధ్యక్షుడిగా వంగపల్లి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. స్థానిక వైశ్యభవన్‌లో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఆయన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మహాసభ సిద్దిపేట జిల్లా కార్యదర్శి తడక లింగమూర్తి, కొమురవెల్లి మండలాధ్యక్షుడు మాంకాల నగేశ్, నాయకులు మాంకాల శంకరలింగం, ఐత రవీందర్, వంగపల్లి వెంకటేశం, తాళ్లపల్లి దయాకర్, రవి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

గజ్వేల్, జూన్ 30: ఆపన్నహస్తం మిత్ర బృందం ఆధ్వర్యంలో 91వ ఆర్థిక సహాయాన్ని గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామంలో ఆదివారం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు పాశికంటి బాల్‌చంద్రం, మిత్రబృందం సభ్యులు ఉన్నారు.

విద్యార్థినులకు తొలగని కష్టాలు


పాఠశాలలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మర్కుక్, జూన్ 30: మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నిన్న మొన్న డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడిన విద్యార్థులు ఇప్పుడు క్రీడా మైదానంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు దుస్తులు ఆరబెట్టుకోవడానికి ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతంలో కట్టెలు పాతుకొని దండ్యాలు కట్టుకొని భయంభయంగా ఉంటున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టనట్టు ఉండడంతో ఏమీ చేయలేని స్థితిలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం


అవార్డు అందుకుంటున్న రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, జూన్ 30: సిద్దిపేట ప్రముఖ జ్యోతిష్యుడు కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం లభించింది. తమిళనాడులోని విల్లిపురంలో ఆదివారం జాతీయ హిందూ ఆలయాల పరిరక్షణ, ఆధ్యాత్మిక జ్యోతిష్య సంస్థ వారు మొదటి జ్యోతిష్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేటకు చెందిన రాజేశ్వర్‌రెడ్డి జ్యోతిష్య రంగంలో ఆయన చేసిన సేవలను గుర్తించి 'జ్యోతిష్య భూషణ' బిరుదు తో సత్కరించారు. ఈ సందర్భంగా తమిళనాడులోని ప్రముఖ జ్యోతిష్యులు రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు.

పాఠశాలలో మత ప్రార్థనల నిర్వహణ తగదు:బీజేపీ

జిన్నారం, జూలై 30: బొల్లారం మున్సిపాలిటీ మల్లన్నబస్తీలో గల ప్రైవేట్ పాఠశాలలో సెలవు రోజున మత ప్రార్థనలు నిర్వహించటం తగదని బీజేపీ జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి అన్నారు. స్థానికంగా ఉన్న ప్రవేటు పాఠశాలలో ఆరు రోజుల పాటు పాఠాలు బోధిస్తూ ఆదివారం మత ప్రార్థనలు నిర్వహిస్తున్నారని, పాఠశాలలో ఇలాంటి చర్యలు చేపట్టేవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

నాయకుల పరామర్శ

గజ్వేల్, జూన్ 30: గజ్వేల్ మండలం సింగాటంకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాటికొండ మధుసూదన్‌రెడ్డిని గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెండే మధు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన నాయనమ్మ మృతిచెందిన విషయం తెలుసుకున్న వారు పరామర్శించారు.


మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1989-90లో పదోతరగతి చదివిన విద్యార్థులు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

- మద్దూరు


చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్ 2003-04లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి రూ.20వేలు విరాళంగా అందజేశారు.

- చేర్యాల